# ఓటమి

"నీవు పూర్తిగా మారిపోయావు, శ్యామసుందరీ!"

"ఇదెప్పటి నుంచి, ఈ ఏకవచనపు ప్రయోగం?"

"నిన్ను చూసి ఎనిమిదేళ్ళు కావస్తుంది కదూ? మర్యాదలు మరచిపోయాననుకుంటాను."

"మర్యాదలు కాదుబాబూ, పెద్దదాన్ని కదా?"

"నిజమే, చాలా పెద్దదానివై పోయావు పిల్లలు పుట్టలేదు గాని, పుడితే పెళ్ళి సంబంధాలు కూడా చూడాల్సి వచ్చేది. నా గురించి కూడా అప్పుడు నువ్వు అనుకోవాల్సి వచ్చేది."

"అదుగో, మళ్ళీ నువ్వు...."

"మరిచిపోయానని చెపుతున్నాగదా? నువ్వంటే తప్పేమిటి? అప్పుడైనా వదినా అని పిలవలేదు కదా? మరదలై ఉంటే ఎంత బాగుండేది అనే అనుకునేవాణ్ణి."

"అది మన చేతుల్లో ఉందా, రాజూ?"

''అందుకే అనుకుంటున్నాను. నువ్వు- ఓహ్.... సారీ, మీరు పూర్తిగా మారిపోయారు, శ్యామసుందరిగారూ!"

''ఏం, ఎలా అనుకుంటున్నావు?"

''ఈ తులసికోట ప్రదక్షిణా లేమిటి? ఈ కార్తీకమాసం తలారా స్నానాలేమిటి? మడిబట్టవునో కాదో కాని, పూజా పురస్కారా లేమిటి? రోజూ సహస్రనామ పారాయణం కూడా ఉందా?''

''రేపు నువ్వే చూదువు గాని, రాకరాక వచ్చావు. నువ్వే అన్నావు కదా, ఎనిమిదేళ్ళైందని. ఓ వారం రోజు లుండకుండా నిన్ను వెళ్ళనిస్తానా ఏమిటి? ఒకవేళ నిన్ను కూడా మార్చేస్తానేమో? అది సరేకాని, రాజూ! నేనో ప్రశ్న అడుగుతాను. నువ్వేమనుకున్నా నాకు పరవాలేదు. నే నెంత చనువుగా, అభిమానంగా అడుగుతున్నానో నీవూ అంత దాపరికం లేకుండా మనసు విప్పి చెపితే సంతోషిస్తాను.''

''మన మధ్య మనసు విప్పడాలు, మూసుకోవడాలు పదిహేనేళ్ళ కిందటే ఆఖరైంది కదా?''

''మరి ఇంత దూరం పనిగట్టుకొని నన్ను చూడటానికి రావడ మెందుకో?''

''అది నా బలహీనత. నే నొక బలహీనతల పుట్టను. నాకు తెలుసు. ఏది చేయకూడదని ఎంత గట్టిగా అనుకుంటానో అదే చేస్తుం టాను. అది సరే కాని, ఇంత అందమైన ఉదయం చల్లగా, హాయిగా, సుఖంగా, ఆనందంగా ఉంది కదా? ఇలా సాధించుకోడా లెందుకు? ఉల్లాసమైన కబుర్లేమైనా చెబితే వింటాను. ఇంత పొద్దున్నే ఎక్కడి కెళ్ళారు మీ వారు? 'గెస్ట్'ను అభిమానంగా పలకరించడానికైనా ఉండొద్దా? ఏం చేస్తున్నారిప్పుడు?''

''నువ్వే చూదువు గాని, నీకే తెలుస్తుంది. ఆ అడగాల్సిన ప్రశ్నలేవో మధ్యాహ్నం భోజనమప్పుడు నువ్వే ఆయన్ను అడుగుదువు కాని.''

''నీకు తెలీదా, లేక చెపితే నేను బోల్డు అసూయ పడతానను కుంటున్నావా? రాత్రి మిమ్మల్ని డిస్టర్బ చేయడం నా కిష్టంలేక పోయింది. చచ్చి చెడి పదింటికన్నా చేరుకోగలిగాను. పది దాటితే చాలా మొహమాటపడేవాణ్ణి. మళ్ళీ వెనక్కు తిరిగి వెడదామా అని కూడా అనుకున్నాను.''

''ఇంకాస్త కాఫీ ఇవ్వమంటావా?''

''ఇంత పెద్ద ఇంట్లో మీరిద్దరే ఉంటారా? ఎలా పొద్దుపోతోంది? నగరానికి దగ్గరే అనుకో. అయినా, ఇంత చిన్న ఊళ్ళో ఉండటం దేనికి? మీరు బాగా సంపన్నులే కదా? సిటీలోనే ఉండి ఇక్కడ వ్యవహారాలు చూసుకోవచ్చు కదా?''

''నాకు సిటీ వ్యామోహం తీరిపోయింది రాజూ! నీవు కిందటి సారి వచ్చినప్పుడు సిటీలోనే ఉన్నాం కదా? ఇక్కడ మాకు ద్రాక్ష తోటలున్నాయి. కూరగాయల ఫారా లున్నాయి. దగ్గరుండి చూసుకోక పోతే ఇబ్బందులున్నాయి. అదిసరేకాని, నువ్వు ఇండియా వచ్చి రెణ్ణెల్లెందట కదా? పోనీలే, ఓసారి నన్ను కూడా చూదామనిపించింది. ఇంకా నెలా, రెణ్ణెల్లుంటావా? నే నడగాలనుకుంటున్న ప్రశ్న అలాగే ఉండిపోయింది, అడగనా?''

''మీ ఇల్లు నాకెంతో నచ్చింది శ్యామసుందరీ! మీ వారికి మంచి టేస్టు ఉంది. కంట్రాక్టర్లకు కళాహృదయం ఉండటం ఆశ్చర్యం సుమా! రేపొద్దున ఫస్ట్ బస్‌కు నేను వెళ్ళిపోతాను. ఇవాళ పన్నెండు కదా? పదహారో తేదీ బొంబాయిలో విమానం ఎక్కుతాను. అందుకని ఈ రోజంతా మంచి కబుర్లు చెబితే వింటాను. అమెరికా వెళ్ళిన తర్వాత కూడా సంతోషం కలిగేట్లుండాలి ఇప్పుడు వినే సరదా ముచ్చట్లు.''

''నేనేమన్నా పెద్ద పెద్ద చదువులు చదివానా? దేశాలు చూశానా నీలాగా? నా దగ్గర కబుర్లేముంటాయి? మా అత్తగారుండగా మేము సిటీలోనే ఉండటానికి వీలైంది. ఆవిడ పోయి కూడా నాలుగేళ్ళైంది. ఇక్కడికొచ్చి కూడా రెండేళ్ళు కావస్తుంది. టి.వీ., రేడియో, పత్రికలు తప్ప బయట ప్రపంచంతో సంబంధం లేదు. ఏ మూణ్ణెల్లకో, నాలుగు నెలలకో కాని సినిమాకు కూడా వెళ్ళను. కాలు బయటపెట్టను.''

''కాలు బయటపెట్టాల్సిన పనేముంది? రెండు కార్లున్నాయి కదా? ఎవరి కారు వారిదే కాబోలు! అచ్చా, నే నెందుకు వచ్చానో తెలుసా? ఆ పాత రోజులను జ్ఞాపకం చేసుకుందామని, ఆ రోజులను తలచుకుంటే నాకు సంతోషమూ, బాధా కూడా కలుగుతాయి.''

ఉదయం తొమ్మిది గంటలు. ఎర్రని తెల్లని ఎండ. గదిలో చల్లగా, వెచ్చగా ఏదో మాదకత కలిగిస్తోంది. స్టీరియో నుంచి అతి సన్నగా షెహనాయ్ వినవస్తోంది. డ్రాయింగ్ రూమ్ విశాలంగా, చూడముచ్చటగా ఉంది. అంత అందమైన ఆధునిక ఫాషన్ల గదిలో సాయిబాబా ఫోటో పొంతన కుదరడం లేదు. ఆ ఫోటోవేపు చూస్తుంటే ఆయన కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూస్తున్నట్లనిపిస్తున్నది. మనసులో ఏదో బెంగ పుట్టుకొని వచ్చేట్లుంది ఆ వాతావరణంలో ఆ సాయిబాబా ఉనికి. చూసీచూడనట్టు ఒకటి రెండుసార్లు చూశాడు రాజు. మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది. కాని ఏదో అభ్యంతరం. చిన్న క్లాసు కుర్రాణ్ణి హెడ్మాస్టరుగా రెండుకో పిలిపించి ఏమీ చెప్పకుండా ఎదుట నిలబెట్టి ఉంచినట్లనిపిస్తున్నది అక్కడి రెండు కేలండర్లు, ఆ సాయిబాబా ఫోటో చూస్తుంటే.

ఆ కేలండర్ల వేపు చూస్తుంటే ఏమిటో ఇరుగ్గానూ, ఇబ్బందిగానూ ఉన్నట్లనిపిస్తున్నది రాజుకు. తాను కూచున్న సోఫాకు ఎదురుగా కిటికీ పక్కన కాశీరత్నాల తీగ విరగబూసి ఉంది. ఎండలో ఆ పూలు మరింత మిలమిలాడుతున్నాయి. ఉడత ఒకటి కిటికీ బద్దెమీద నుంచి ఆ పూలను నోటితో అందుకోవడం, మళ్ళీ ఎటో వెళ్ళడం, మళ్ళీ వచ్చి మునికాళ్ళతో ఇంకో మొగ్గనో, పువ్వునో తుంచి నోటికి చేర్చడం చేస్తున్నది. ఆ దృశ్యం ముచ్చటగా ఉంది రాజుకు.

''ఉడతలు, బుడతలు ఉంటే ఇల్లు అందంగా ఉంటుంది కదూ?'' అన్నాడతను.

ఆమె అందంగా నవ్వింది. "అమెరికా వెళ్ళింతర్వాత కవిత్వం కూడా నేర్చుకున్నావులా ఉంది!"

ఆవిడవైపు తల తిప్పుతుంటే మళ్ళీ కాలెండర్లు కనబడ్డాయి. ఒకటి రాఘవేంద్రస్వామిలా ఉంది. వీణ వాయిస్తున్నట్లుగా ఉంది ఆ చిత్రం. ఇంకోటి 'అమ్మ'ది. ఆమె బుగ్గమీద అరచేయి ఆనించుకొని లోకాన్ని చోద్యంగా చూస్తున్నది. ప్రశాంతత, వాత్సల్యం ఆ గదినిండా నిండినట్లనిపిస్తున్నది. ఇంకోవైపున అపారమైన నీలిసముద్రంలో విష్ణుమూర్తి పాదాలు ఒత్తుతున్న లక్ష్మీదేవి. చుట్ట చుట్టుకొని పడుకున్న పెద్ద పాముమీద కూచుని ఒకరు, పడుకుని ఒకరు.

రాజుకు నవ్వొచ్చింది. "ఇవన్నీ ఈ గదిలో ఉంచడం దేనికి?" అన్నాడు.

"ఏ బట్టలో, ఇంకా ఇతరత్రా ఏ వస్తువులో కొన్నప్పుడు వచ్చాయనుకోకూడదా? దీనికింత హేతువాదం ఎందుకు?"

"నే నొప్పుకోను సుమా! మనకు ఇష్టం లేకపోతే; వాటిమీద ఏమిటో అభిమానమో, గౌరవమో లేకపోతే ఇలాంటి కేలండర్లు వేలాడదీయం. ఎవరో ఇచ్చారనో, ఎలాగో వచ్చాయనో అర్ధనగ్న చిత్రాలు, వ్యాపార ప్రకటనలు మనం గోడలకు వేలాడదీయం గదా?"

"అవుననుకో! ఇవి ఇలా అలంకరించడంలో తప్పేమిటి? ప్రశాంతంగా, బాగా పరిచయమైనచోట ఉన్నట్లనిపిస్తుంది-ఇంట్లో తిరుగుతున్నప్పుడు ఈ చిత్రాలు చూస్తుంటే నాకు."

"అందుకే నీవు బాగా మారిపోయావని నేననడం. డ్రాయింగ్ రూమును కాస్తా 'విత్‌డ్రాయింగ్' రూమ్ చేశావు. మీ వారేమీ అభ్యంతరం చెప్పలేదా - ఈ పాదాలొత్తే లక్ష్మీదేవి, బాబాలు, అమ్మలు కేలండర్లు ఇక్కడ తగిలించడానికి?"

"ఎవరి ఇష్టాలు వాళ్ళవి. ఇందులో అభ్యంతర పెట్టడాని కేముంది?"

"పోనీ, వారినే అడిగి చూస్తానులే?"

"తనకు నమ్మకాలేమీ లేవంటారు."

"నా కదే ఆశ్చర్యం! నీకు కూడా ఇటువంటి చాదస్త్రాలేవీ ఉండేవి కాదు కదా? చదువుకునే రోజుల్లో పెద్ద ఫెమినిస్టు ఉద్యమ నాయకురాలిలా మాట్లాడేదానివి. ఓసారి ఏదో డిబేటింగ్‌లో పురాణాలను దుయ్యబట్టావు. శృంగారం కోసం తన్నడం కాదు, దొంగవేషాలు వేస్తే నిజంగా తన్నినా తప్పులేదు అని కదా సత్యభామ చేసిన పనిమీద నీ తీర్పు! పావుగంటదాకా చప్పట్లు ఆగనేలేదు."

"ఇవాళ్టికీ నా అభిప్రాయం అదేనూ. సరేగాని, వచ్చినప్పటి నుంచీ నన్ను సతాయించడమే చేస్తున్నావు. అవును రాజూ, నీవు పెళ్ళెందుకు చేసుకోలేదు? లేదా, అమెరికాలో ఎవరినైనా చేసుకున్నావా?"

"ఛ....ఛ! అటువంటి అప్రాచ్యపు పని నేను చెయ్యలేదు మన దేశం అమ్మాయినే పెళ్ళాడాలని నా కోరిక. ఎనిమిదేళ్ళ క్రిందట ఇక్కడికి వచ్చినప్పుడు చాలా వాకబు చేశాను. ఆడపిల్లల హాస్టలుకు కూడా వెళ్ళి చూసొచ్చాను ఓ స్నేహితుడి సిఫార్సు కాదనలేక! నేను నచ్చక కొన్ని పెళ్ళిచూపులూ, నాకు నచ్చక కొన్ని పెళ్ళిచూపులూ కలసిరాలేదు."

"నీవు కోతలు కోస్తున్నావు. బడాయి మాటలు చెపుతున్నావు. ప్రపంచంలో ఏ ఆడపిల్లా నీకే నచ్చడంలేదేమో! కాని, నిజంగా మనసే ఉంటే పెళ్ళికూతుళ్ళే కరవయ్యారా?"

"నీవు అన్యాయంగా మాట్లాడేస్తున్నావు. ఎవరైనా ఈ మాట అంటే నేను సహిస్తానేమో కానీ నీ వనడం ఏమీ బాగాలేదు. నీవు పురాణాల్లో కథ వినలేదా? గణపతికి ఎందుకు పెళ్ళి కాలేదో? పార్వతీ

దేవిలాంటి అమ్మాయి కోసం చూసి చూసి అతనికి విసుగొచ్చిందట. అలాంటి పిల్ల మరి ఇంకొకరెవరుంటారు?"

శ్యామసుందరి ముఖం చాలా మ్లానమైపోయింది. పదిహేను పదహారేళ్ళ కింద ఇంకా నాలుగు రోజుల్లో పెళ్ళివారు తనని చూడడాని కొస్తున్నారన్న వేళ- ఆ రోజుల్లో రాజు పడిన మథన, అప్పట్లో అతని కుటుంబ స్థితిగతులు, అప్పటికింకా అతని ఇద్దరక్కలకు పెళ్ళికాక పోవడం, నెలో రెణ్ణెల్లో తానే అతని కంటే పెద్ద కావడం, ఇంట్లోవాళ్ళు ఏ విధంగానూ సమాధానపడరని తనకు స్పష్టంగా అనిపించడం, అతడెంతో గంభీరంగా, బాధగా, భయంగా, ఆశగా, ఆత్రతగా ఏవేవో విషయాలు చెప్పాలని ప్రయత్నించినప్పుడు చిన్నపిల్లాడి మాటలులా తేలిగ్గా తను వాటిని తీసిపారేయడం, అల్లరిగా, చిలిపిగా నవ్వడం- శ్యామసుందరికి గుర్తు వచ్చింది ఆ ఘట్టమంతా. ఇప్పటికీ తనకు అతను చెప్పే మాటల్లో అంత గాఢత ఉన్నట్లు నమ్మకం కలగదు. అయితే, ఇప్పుడేమిటో ఉత్సాహమనిపిస్తున్నాయి రాజు మాటలు. నిజమే కాబోలు, నిజమైతే బాగుండు ననిపిస్తున్నాయి. జాలిగా, ప్రౌఢంగా, కొంటెగా నవ్వి, "నేను నమ్మను. ఎవరినీ ప్రేమించలేదా ఇన్నాళ్ళూ? ఇంకా పచ్చిగా అడగడం నాకు చేతకావడం లేదు. ఇంకో రెండేళ్ళలో నలభై ఏళ్ళు వస్తాయి నీకు. అప్పుడిక నీవు పెళ్ళి చేసుకోవాలన్నా అసాధ్యమైపోతుంది. సర్దుబాటు, సరిపెట్టుకోవడం, రాజీలేని జీవితమే ఉండదు నాకు తెలిసినంతవరకూ. జీవితాన్ని జీవించడమే మన వంతు. అయితే అందులో కాస్త తరతమాలుంటాయి."

"ఈ మాటలకేం? పెళ్ళయిన వాళ్ళు అందులో ఏమీ లేదనీ, పెళ్ళి కానివాళ్ళు అందులోనే ప్రపంచమంతా ఉందనీ అనుకోవడం మామూలే! అస్కార్ వైల్డ్ అని ఒక గొప్ప రచయిత ఏమన్నాడో తెలుసా? జీవితాంతం ప్రేమిస్తూ ఉండాలంటే పెళ్ళి చేసుకోకూడ దన్నాడు. నాక్కూడా అలాగే అనిపిస్తున్నది."

ఇంతలో ఫోన్ మోగింది. చాలా క్లుప్తంగా, నిర్లిప్తంగా ముగిసింది ఆ ఫోన్ సంభాషణ. అడక్కుండానే చెప్పింది శ్యామసుందరి- మధ్యాహ్నం భోజనానికి ఆయన రారు. అందువల్ల తన కోసం వేచి ఉండక్కర్లేదు. ఢిల్లీ నుంచి మినిస్టర్‌గా రెవరో వస్తున్నారు. ఆయన్ను కలుసుకోవలసి ఉంది - అని ఇంటాయన సందేశం.

"నాకు ఒకందుకు సంతోషంగానూ, ఒకందుకు విచారంగానూ ఉంది" అన్నాడు రాజు.

నాకు సంతోషమూ లేదు, విచారమూ లేదు" అన్నది శ్యామసుందరి.

"భయం వేయడం లేదా భారతనారికి?"

"నువ్వేం ఆక్షేపించనక్కర్లేదు. నీవెంత పిరికివాడవో నాకు తెలీకపోతే కదా?"

"అవును, నిజమే! అందుకే నన్ను అందరూ చులకనగా చూస్తారు, సాధిస్తారు. ఒట్టి అధీర హీరోవి నువ్వు అంటారు నా స్నేహితులు."

"నువ్వు హీరోవి కూడా కాదు. సరే, ఆ విషయాలు పోనీ, మీ అక్కవాళ్ళను చూసొచ్చావు గదా? పిల్లలు పెద్దవాళ్ళై ఉంటారు. వాళ్ళైనా నిన్ను ఒకింటివాణ్ణి చేయలేకపోతున్నారే?"

"అదొక పెద్ద బెడద వచ్చి పడింది నాకు. ఇద్దరూ నాకోసం ఏవేవో సంబంధాలు చూశారు. వాళ్ళిద్దరికీ పోటీ ఎక్కువైంది. దాని వల్ల ఒకరంటే ఒకరికి కోపంగానూ ఉంది. పెద్దక్క కూతురికి రెండేళ్ళ కిందట పెళ్ళయింది కాబట్టి సరిపోయింది. లేకపోతే నాకు అది కూడా చిక్కు తెచ్చిపెట్టేదే. వెళ్ళాను. ఒకరు అనంతపురంలోనూ, ఇంకోరు వరంగల్‌లోనూ ఉంటున్నారు అక్కలు, అప్యాయత లేదు. పెద్దక్క

వాళ్ళమ్మాయి పెళ్ళికి డబ్బేదో సర్దుబాటు చెయ్యమని అడిగింది. ఆమె అనుకున్నంత ఇవ్వలేకపోయాను అది ఆవిడకు అసంతృప్తి. చిన్నక్క రెండు మూడు సంబంధాలు చెప్పింది. వాటిలో ఉత్సాహం చూపలేదని ఆవిడ కోపం."

"ఇంతకూ ఎలాంటి పిల్ల కావాలో నాకు చెపుదూ, నేను చూసి పెడతాను."

"నాకు తెలిస్తే కదా? అప్పట్లో అనుకునేవాణ్ణి. నీకన్నా అందమైందీ, తెలివైందీ, చలాకీ అయినదీ ఎవరైనా దొరకాలని. పోనీ, నీలాంటిది కూడా నాకు కనిపించడం లేదు."

"నాలో ఏముంది రాజూ? ఆ చిన్నతనం వేరు. చిలిపితనం వేరు. కోరుకోవాలే కాని అందాల హరివిల్లును అందుకోవచ్చునన్న అతిశయం ఉండేది నాకు. నీకు తెలుసు కదా? టెన్నిస్ ఆడేదాన్ని, గొంతు చించుకుని అరిచేదాన్ని. ఈ పెళ్ళి జంజాటం పెట్టుకోకపోతే ఎలా ఉండేదో? ఆయన అభిరుచులు వేరు. నేను నీ ముందు అభిమాన పడాల్సింది ఏముంది కనుక! ఎలాగూ నువ్వు నాలుగు రోజుల్లో చాలా దూరం వెళ్ళిపోతున్నావు. మళ్ళీ ఏ ఎనిమిదేళ్ళకో, పదేళ్ళకో కలుసుకుంటే కలుసుకోవచ్చు. లేదా కలుసుకోకనే పోవచ్చు. కాబట్టి చెప్పేసినా నాకు పోయేదేమీ లేదు. కనీసం నీకు కళ్ళు విడివడవచ్చు. ఈ జీవితానికి, ఆ మాటకు వస్తే ప్రతి జీవితానికి అట్లాగే జరగడానికి కార్యకారణ సంబంధం ఉందని గట్టిగా అనిపిస్తున్నది నాకు. ఏదీ ఉట్టినే జరగదు చూడు. నా చిన్నతనంలో ఇప్పటిలా ధనవంతులం కాము. ఇప్పుడా డబ్బుకూ, దానివల్ల తీరే సౌకర్యాలకూ కొదవలేదు. అయినా, నిండుదనం లేదనిపిస్తున్నది."

"నువ్వు చెపుతున్న విషయాలు చాలా విచిత్రంగా ఉన్నాయి. మీ ఇల్లు ఎంత చక్కగా ఉందో? ఒకరిద్దరు పిల్లలుంటే బాగుండేది. అప్ప చెల్లెళ్ళ పిల్లల్ని ఎవరినైనా తీసుకోవచ్చు కదా? అదీకాక, నీవు ఇష్టపడి చేసుకున్న సంబంధమే కదా ఇది? బాదరబందీలేమీ లేవు. నా సంగతి అలా కాదు. వ్యర్థంగా గడిపేశాను కాలం. కట్టి పడేసే బంధనాలేవీ లేవు కనుక దూరంగా వెళ్ళాను. అట్లాంటా అందమైన ప్రదేశం. అక్కడ తెలుగువాళ్ళు చాలామంది ఉన్నారు. యాంత్రికమైన జీవితం. ఒకటి రెండు సందర్భాల్లో అనుబంధాలు పెంచుకోబోయి ఆశాభంగం చెందాను."

"ఆశా లేదు, భంగమూ లేదు. కొన్ని అనుకుంటాము. అవి చాలామంది విషయంలో అలా జరగవనుకొంటాను. మా వారు అసలు ఏ విషయమూ పట్టించుకోరు. ఆయనకు ఏ ఆశా లేదు. భంగం అంత కంటే లేదు. మా ఇంటికి వచ్చే దారిలో చూసి ఉంటావు. చిన్న ఆంజ నేయుల మండపం ఉంది. అక్కడ కూచుని ఆయన పేకాడతారు తీరిక ఉన్నప్పుడు. అది దేవుడి గుడి అని అయినా లేదు, ఆయనా- ఆయన స్నేహితులూ బీడీలు కాలుస్తా రక్కడ! 'మనింటికే పిలవవచ్చును కదా ఆ స్నేహితులను' అంటాను నేను. అది మళ్ళీ ఆయన హోదాకు తగదట. ఒక మృదుత్వం, సున్నితంగా ఆలోచించటం, అంతఃకరణం కనపడవు. ఇలా ఎందుకు జరిగిందో ఎవరు చెప్పగలరు? ఆ దేశాల్లో పెళ్ళిళ్ళే సుఖమైనవేమో?"

ఇట్లా అనుకోలేదు తాను. రాజుకు చాలా విచారమైంది. మూడు వారాలైంది తాను ఈ దేశం వచ్చి. ముఖ్యులైన స్నేహితుల్ని చూడ డానికి, దగ్గరి బంధువుల్ని చూడటానికి పది పన్నెండు ఊళ్ళదాకా తిరిగాడు. పాతిక ముప్పై ఏళ్ళ కిందట తన చిన్నప్పటి పరిస్థితులకూ, ఇప్పటి పరిస్థితులకూ చాలా తేడా కనపడుతోంది. రోగాలు, రొష్టులు,

అసంతృప్తులు, ఎక్కడ చూసినా అశుభ్రం, పత్రికలనిండా ఘోరాలు, వీథుల్లో మురికినీరు, కల్మశం. తన స్నేహితుడు చెప్పినట్లు ఈ దేశంలో ఇంత సూర్యరశ్మి లేకపోతే దేశమంతా పెద్ద ఆసుపత్రి అయి ఉండేది ఎప్పుడో. ఎవరిని కదిలించినా తమ బాధలేవో చెబుతారు. స్కూల్లో అడ్మిషన్ దొరకడం కష్టమట. టెలిఫోన్లు పనిచేయవట. ఈ మూడు వారాల్లోనే తన కెన్నో అనుభవాలైనాయి. మానవాను బంధాలు లేవు. ఆప్యాయంగా ఎవరూ పలకరించరు. మీకేం కావాలని అడగరు. ఒక రకంగా చూస్తే ఇక్కడ కంటే అక్కడే తన దినచర్య క్రమబద్ధమే కాక, ఆలోచించడానికికూడా తీరిక లేకుండా గడుస్తుంది. "ఆయన ఎలాగూ రానన్నారు కదా? మనం భోజనం చేద్దాం" అని లేవమన్నది.

మధ్యాహ్నమంతా నిద్రపోయాడు రాజు. ఏ నాలుగింటికో మెలకువ వచ్చింది. ఒకవేళ నందకుమార్ రాత్రికి కూడా రాకపోతే? ఛ....ఛ, ఇదేమిటీ ఆలోచన? తన మనస్సింత దిగజారిపోతోంది. అన్యాయంగా ఆలోచిస్తోంది. కుశంకలు దురాశలు పోషిస్తోంది.

సాయంకాలం అలా షికారు వెళ్ళి వస్తానన్నాడు. చిన్న ఊరు. నగరానికి పాతికమైళ్ళ దూరాన ఉంది. వంద ఇళ్ళు కూడా ఉంటాయో ఉండవో. కొత్తగూడ అట దాని పేరు. గంటకూ, రెండు గంటలకూ ఒక బస్సు ఉంది. దూరాన ఏవో క్వార్టర్సు ఉన్నాయి. యూనివర్సిటీ భవనాలు కనపడుతున్నాయి.

సూర్యాస్తమయ దృశ్యం మనస్సునంతా ఆహ్లాదంతో నింపింది.

ఇంటికి వచ్చేసరికి నందకుమార్ వచ్చి ఉన్నాడు.

"రండి, రండి. మీరు నిద్రలేవకముందే వెళ్ళిపోవాల్సి వచ్చింది" అని ఆదరంగానే పలకరించాడు.

ఇంట్లో ప్రవేశిస్తూ ఉండగానే సుమధురమైన ఊదువత్తుల పరిమళం పలకరించింది. తులసికోట చుట్టూ వెలుగుతున్న ప్రమిదల దృశ్యం చాలా అందంగా కనిపించింది రాజుకు. ఒక ప్రశాంత వాతావరణం, ఒక నిశ్చలమైన గాంభీర్యం అక్కడంతా పరచుకొని ఉంది.

శ్యామసుందరి ముఖంలో ఒక తేజస్సు కనపడుతోంది. ఆవిడ పూజ ఏదో పూర్తి చేసి వచ్చి పలకరించింది. "ఎప్పుడంటే అప్పుడు భోజనం రెడీ!"

భోజనాల దగ్గర కూడా నందకుమార్ ఎక్కువ మాట్లాడలేదు. "నేను కూడా అమెరికా వచ్చి ఏదైనా ఇండస్ట్రీ ప్రారంభిద్దామనుకుంటున్నాను" అన్నాడు. రాజు పనిచేసే ఇంజనీరింగ్ సంస్థ తయారు చేసే పనిముట్లు, వాటి నాణ్యత గురించి అడిగాడు. శ్యామసుందరి ఏ విషయమూ పట్టించుకోలేదు.

ఆ రాత్రి రాజుకు నిద్ర పట్టలేదు. పాప చింతన కాదు. కనీసం పొద్దుపోయినదాకా శ్యామసుందరితో ఆనాటి కళాశాల చదువులు, వేడుకలు, ఉత్సవాలు, స్నేహాలు, కుటుంబ అనుబంధాలు మాట్లాడే అవకాశంలేదు ఇప్పుడు. రాత్రిఅనే హోరుమనే అలలవేగంతో పారుతున్న నదికి అటూ ఇటూ ఉన్నట్లున్నారు తామిద్దరూ. అంతా కలత నిద్ర. ఏవేవో ఆలోచనలు, దృశ్యాలు. మామూలుకన్నా కాస్త ఆలస్యంగా నిద్ర లేచినట్లున్నది. ఉదయకాలపు ప్రశాంతత మనోహరంగా ఉంది.

మొహం కడుక్కుని తన గదిలోకి వచ్చేసరికి కళ్ళు తిరిగినంత పనైంది రాజుకు.

శ్యామసుందరి నవ్వుతూ గుమ్మంలో నిలిచి ఉంది. మంచి గంధపు రంగు పట్టుచీర ఆవిడ ఒంటిమీద మెరసిపోతున్నది. తలారా

స్నానం చేసి అప్పటికే పూజ ముగించినట్లున్నది. తల్లో పెద్ద తెల్ల చామంతి పువ్వు అందంగా అమరి ఉంది. వదులుగా జడ వేలాడు తున్నది.

"కాఫీ తీసుకు వస్తాను" అని ఆప్యాయంగా, ఆదరంగా నవ్వు మొహంతో చెప్పి వంటింటి వైపు తిరిగింది. చేయి చాస్తే ఆమె భుజం చేతికి తాకుతుంది. మతిపోయిన వాడిలా రాజు ఆమె వెనుకే చప్పున జరిగి రెండు భుజాలపైనా చేతులు వేశాడు.

ఒక్క క్షణం ఆమె స్పృహ కోల్పోయినట్లుగా గాభరా పడింది. మహా భయంకరమైన దృశ్యాన్ని ఏదో చూసినట్లు, కాలికి పామేదో సర్రున చుట్టుకొన్నట్లు భయంతో విహ్వాలభావంతో కేక పెట్టింది.

తమాయించుకుని దూరంగా జరిగి అప్రసన్నంగా ''మావారను కొని బేజారెత్తిపోయాను" అన్నది. *

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 1989)